


# సర్పశిల

## – భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ :1 (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

❀❀❀

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

❀❀❀

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

❀❀❀

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్లు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

❀❀❀

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ --0

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

**ఒక చిత్రమైన నవ్వు**...డ్రైవర్ ముఖంలో. "నువ్వు వున్నావా విలియమ్స్?" అడిగాడు శ్రీనివాస్.

"ఉన్నాను." అదే నవ్వు.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"నవ్వులకీ ఏడ్పులకీ సమాధానాలు వుండవు శ్రీనివాస్. గతంలో జరిగిన సంఘటనలు గుర్తొచ్చి నవ్వనూ వచ్చు, ఏడవనూ వచ్చు, నిట్టూర్చనూ వచ్చు. దీర్ఘమైన ఆలోచనల్లో పడిపోనూ వచ్చు. ఏరోజు గతం ఆరోజుదే అయినా, మరుసటి రోజుకి అదే పునాది. జీవితమనే భవనం చివరిక్షణం వరకూ కట్టుబడుతూనే వుంటుంది. పునాది ఏ రోజుకారోజు మార్పు చెందుతూనే వుంటుంది" ఆగాడు విలియమ్స్. అసలు డ్రైవరు పేరు తిరుమల.

'ఇతని శరీరంలో అతను ప్రవేశిస్తే మానసికమైన మార్పులు ఎన్నుంటాయి? శరీరం ఒకరిది. అది పనిచేసే, లేక, ఆ శరీరాన్ని పని చేయించే మనస్సు వేరొకరిది.

ఆలోచిస్తూ సైలెంటైపోయాడు శ్రీనివాస్.

"అంత ఆలోచన అక్కరలేదు. నేను వచ్చిన వెంటనే ఇతని మనసు నిద్రాణస్థితిలోకి వెళ్ళిపోతుంది" నవ్వాడు తిరుమలలోని విలియమ్స్.

"ఓ విధంగా ఆలోచిస్తే ఇదో పచ్చి అబద్ధంలా అనిపిస్తోంది" కొంత కఠినంగానే అన్నాడు శ్రీనివాస్.

"అసలితనిలోకి ప్రవేశించే అధికారం నీకెవరిచ్చారురా? రాబీలో దూరావు. కొంతసేపు నాలోనూ దూరావేమో.. ఇది అన్యాయమూ అమానుషమూ కాదా?" ఉక్రోషంగా అరిచాడు.

"ఒక్కసారి నీ బాల్యాన్ని స్మరించుకో. అదంతా ఓ కలలాగో అబద్ధంలాగో నీకు అనిపించదా? ఓయీ, క్షణం క్షణం శరీరమూ తనని తాను మార్పుకి గురిచేసుకుంటూనే వుంటుంది. నేను రాబీలో దూరింది అతని శారీరక మానసిక స్థితుల్ని సరిదిద్ది, భవిష్యత్తు కోసం సంసిద్ధం చేయడానికి. ఈ తిరుమలలో దూరింది నిన్ను చేర్చాల్సిన చోటుకి చేర్చడానికి. శ్రీనివాస్.. అనవసరంగా ఆలోచించకు. వీలయితే ఆనందించు" విలియమ్స్ వాయిస్ 'కర్ట్'గా వినిపించింది విలియమ్స్ స్వరం. ఇప్పటివరకూ అతను కఠినంగా మాట్లాడటం శ్రీనివాస్ వినలేదు.

"సారి విలియమ్స్. నువ్వేం చేస్తున్నావో నీకు తెలుసు. కానీ, మేము ఏ స్థితిలో వున్నామో ఏమి చేస్తున్నామో మాకు తెలీదు. ఏదో తోలుబొమ్మలు ఆడినట్టు ఆడుతున్నాం. అసలీ కన్ఫ్యూజన్ ఎందుకూ? మంచీ చెడులకు మధ్య సంఘర్షణ ఇప్పటిది కాదు. యుగయుగాలుగా జరుగుతూనే వుంది. మళ్ళీ మళ్ళీ శరీరాలు మార్చుకోవడం, మళ్ళీ చస్తూ మళ్ళీ పుట్టడం ఇదంతా అసలు ఎందుకు? రాబీ గత జన్మలో భారతీయుడు. బ్రాహ్మణుడు. ఈ జన్మలో అమెరికాలో పుట్టి మళ్ళీ ఇక్కడికే రావడం ఎందుకూ? అలాగే రోజుల తరబడి ప్రయాణిస్తూనే వున్నాం. ఎందుకో తెలీదు. ఎక్కడికో తెలీదు. మా అమ్మ నేను ఫోన్ చేసినప్పుడల్లా 'ఎప్పుడు వస్తావురా' అని అడుగుతూనే వుంది. నువ్వేమో నన్ను చేర్చాల్సిన చోటుకి

చేర్చడం కోసం యీ తిరుమల శరీరంలో దూరానంటావు" నిర్వేదంగా అన్నాడు శ్రీనివాస్. దాదాపు ఇరవై రోజుల్నించీ అదే కారులో ప్రయాణిస్తున్నారు. పగళ్ళు విశ్రాంతి రాత్రులు ప్రయాణం.

"నీవన్నది నిజమే. అంతులేని కథలాగా అంతులేని ప్రయాణం చికాకు తెచ్చేదే. కానీ శ్రీనివాస్..లోకంలో పుట్టే ప్రతిజీవి వెనకా ఓ ప్రణాళిక వుంది. అలాగే నీ జీవితం వెనకాల కూడా. నీకు మాత్రమే సాధ్యమయ్యేవి కొన్ని వున్నాయి. కారణం ఆ ప్రణాళికలో నీకూ భాగం వుంది గనక. అన్నట్టు అతి త్వరలో యీ పయనం ముగుస్తుంది. నేను ఇప్పుడు మిమ్మల్ని ఓ గెస్ట్ హౌస్‌కి చేరుస్తా, రెండురోజులు నేను నీకు కనపడను, వినపడను. ఈ తిరుమల తిరిగి వెళ్ళిపోదామని గొడవ చేస్తాడు. ఎలాగొలా ఒప్పించు. ఓ రహస్య దేవాలయానికి వెళుతున్నామని చెప్పు. ఈ మనిషికి దేవాలయాలంటే మహా పిచ్చి. కరెక్టుగా 48గంటల తరవాత వస్తాను." చెబుతూనే ఓ గెస్ట్‌హౌస్ ముందర ఆపాడు తిరుమలలో వున్న విలియమ్స్.

ఆశ్చర్యంగా గెస్ట్‌హౌస్ పేరు చూశాడు. హిందీ ఇంగ్లీషులలో రాసి వుంది.. గెస్ట్‌హౌస్ పేరు కురుక్షేత్ర.

సన్నగా పొడుగ్గా అందంగా వున్న ఓ అమ్మాయి కారు దగ్గరకు వచ్చి "ఆర్ యూ మిస్టర్ శ్రీనివాస్. మిస్టర్ విలియమ్స బుక్కుడ్ ఎ సూట్ ఫర్‌యూ. వియ్ హావ్ ప్లేస్ ఫర్ డ్రైవర్స్ టూ. మై నేమీజ్ శరద్వతి" అన్నది.

"ఇది వింధ్య పర్వతశ్రేణుల్లో ఉన్న ఖజురాహోకి 26 మైళ్ల దూరంలో వున్న ఓ మాదిరి గ్రామ నగరం లాంటిది. ఇది గ్రామము కాదు, నగరమూ కాదు. మధ్యస్తమైనది. కొన్ని బస్సులు వస్తాయి. ప్రయాణీకులు నూటికి ఎనభై పాళ్ళు యాత్రికులే. ఇక్కడికి కొండ శిఖరం మీద మహారాజు 'గండ్' కట్టించిన సుఖద్వార్ విరూపాలయం వుంది. సుఖ్‌ద్వార్ పేరు మీదే యీ వూరికి సుద్వారా, తర్వాత సతారా అన్న పేరొచ్చింది. ఇప్పచెట్లు కోకొల్లలు. ఆల్‌మోస్ట్ గ్రామస్తులందరూ ఇప్పసారా కాచి అమ్ముతారు. అఫ్‌కోర్స్ స్వచ్ఛమైన, కల్తీలేని సారా గనక జనాలూ నిశ్శంశయంగా సేవిస్తారు" నవ్వి శ్రీనివాస్‌తో అన్నది శరద్వతి. వాళ్ళిద్దరూ నడుస్తున్నారు. గెస్ట్‌హౌస్‌కి ఆనుకున్న కురుక్షేత్ర గార్డెన్‌లో వాకింగ్ ట్రాక్ ఉంది.

"అసలీ సతారా ఎప్పుడు నిర్మించబడింది?" కుతూహలంగా అడిగాడు శ్రీనివాస్

"తెలీదు, ఈ గ్రామం చాలా పురాతనమైనదంటారు. శ్వేతాశ్వుడు అనే ఓ సేనాని నిర్మించాడు అంటారు. అతని పేరు మీదే 'సతారా' అని వచ్చిందనీ అంటారు. గతం అనేది నిర్మించబడేది ఊహమీదే. స్పష్టమైన ఆధారాలు దొరకడం కష్టం. ఛేదిరాజులే తరువాత తరువాత చందేల్ రాజులుగా పిలవబడ్డారనీ హిస్టోరియన్‌లు అంటారు. ఏదేమైనా సుఖ్‌ద్వార్ విరూపాలయానికి యాత్రికులొచ్చేది నిజం. ఈ వూళ్ళో కనీసం ఒకరాత్రి శయనం జరపడం నిజం" ఆగింది శరద్వతి కొంత అలసటతో.

శరద్వతికి పాతికేళ్ళు ఉండొచ్చు. పెళ్ళయిన చిహ్నాలు లేవు.

"మీరిక్కడికి ఎలా వచ్చారూ?" కుతూహలంగా అడిగాడు శ్రీనివాస్.

"అదో సిల్లీ కథ. నేను ఢిల్లీలో చదువు పూర్తిచేసి, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాను. మా బాస్ పేరు అనూపవతి. ఆవిడ గ్వాలియర్. వాళ్ళబ్బాయి పేరు శ్రవణ్. ఆ శ్రవణ్‌కి నన్నిచ్చి వివాహం చెయ్యాలని ఆవిడ ఆలోచన. ఆ సంగతి నాకేం తెలుసూ? మా గెస్ట్‌హౌస్‌లోనే నీకు ఉద్యోగం వేయిస్తానని ఇక్కడికి తెచ్చింది. ప్రస్తుతం ఆవిడా ఇక్కడే వుంది" నవ్వింది శరద్వతి.

"మరి పెళ్ళి?"

"అదా..! ఈవిడకి తెలీకుండా అతనెప్పుడో పెళ్ళిచేసుకున్నాట్ట. ఆ విషయంలో తల్లీకొడుకులు యుద్ధం చేస్తుంటే నేనే కల్పించుకుని యుద్ధ విరమణ చేయించాల్సి వచ్చింది" పకపకా నవ్వింది శరద్వతి. అంత అందమైన నవ్వుని చూడటం శ్రీనివాస్‌కి అదే మొదటిసారి.

"మీ వాళ్ళ సంగతీ?" తనూ నవ్వి అన్నాడు శ్రీనివాస్.

"మా వాళ్ళంటూ ఎవరూ లేరు. నా జీవితం మొదలైంది ఓ అనాధాశ్రమంలో. నాకు చదువు సంధ్యలు నేర్పింది వాళ్ళే. అదో గొప్ప సంస్థ. అనూపవతిగారు మూలమూ ఆ సంస్థే. అందుకే ఆవిడకి నేనంటే ఇష్టం. ఆవిడే 'కురుక్షేత్ర' హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్ పెట్టింది ఢిల్లీలో. 'కురుక్షేత్ర' అని ఎందుకంటే, మేమిద్దరమూ పెరిగిన అనాధాశ్రమం కురుక్షేత్రలోదే. ఆ అనాధాశ్రమ నిర్వాహకుడు నకులే. నకుల్ పూర్వీకులు ఆ అనాధాలయాన్ని నిర్మించారు. కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఆ అనాధాశ్రమానికి వుంది. మేమంతా దాన్నే అనాధాలయం అంటాం. అనూపవతిగారి కొడుకూ కోడలూ యు.ఎస్.కి వెళ్ళిపోయారు. అనూపవతి భర్తగారు ఎప్పుడోగానీ ఇక్కడకు రారు. ఆయన ఉండేది గ్వాలియర్‌లో" వివరంగా చెప్పింది శరద్వతి.

"మీ పేర్లు భలే వున్నాయి, శరద్వతి, అనూపవతి అని" మెచ్చుకుంటూ అన్నాడు శ్రీనివాస్.

"వతి అంటే 'కలిగియున్నది' అని అర్థం. గుణం కలిగితే గుణవతి. ధనం వుంటే ధనవతి, శీలం ఉంటే శీలవతి, చైతన్యం వుంటే చైతన్యవతి.. ఇలా ఆడపిల్లలందరికీ 'వతి'తో ఎండ్ చెయ్యడం మా అనాధాలయం సంప్రదాయం. గుణవంతే, ధనవంతే, యశోవంతే శౌర్యవంతే, శౌర్యవాన్ బలవాన్ ఇలా అన్నమాట." వివరించింది శరద్వతి.

పగలు పొద్దెక్కినా చలి తగ్గలేదు. చలికాలం పగటిపూట టెంపరేచర్ మరీ పడిపోదుగానీ 24, 25 వరకూ ఉంటుంది. ఆహ్లాదమైన చలి. అయితే సతారా పర్వత శ్రేణుల్లో వుండడం వల్ల ఎగుడు దిగుడుగా వుంటుంది. నడవాలంటే శ్రమే.

"కమ్..! బ్రేక్‌ఫాస్ట్‌కి పురమాయించాలి. మొదటి బస్సో, కారో వచ్చేలోగా ఫలహారాలు సిద్దం చెయ్యాలిగదా!" వెనక్కి తిరిగి గెస్ట్ హౌస్‌వైపు అడుగులేస్తూ అంది శరద్వతి. మౌనంగా ఆమె వెంట నడిచాడు. శరద్వతి అనాధ అని తెలిశాక శ్రీనివాస్ గుండె బరువెక్కింది. ఆమెని చూస్తే ఏ రాజకుమార్తో అన్నంత అందంగా ఆరోగ్యంగా ఉంది.

తల్లిదండ్రులు ఎవరోమరి. ఆలోచిస్తూ నడుస్తున్నాడు శ్రీనివాస్. కురుక్షేత్ర కొండ శిఖరానికి కొంచెం కిందుగా ఉంది. కిందకి చూస్తే అగాధమైన లోయ.

రూంలోకి పోతూ శ్రీనివాస్ అడిగాడు, "శరద్వతీ విలియమ్స్ మీకు ఎలా పరిచయం? ఆయన నాకోసం ఎప్పుడు సూట్ బుక్ చేశాడు?"

"ఆ విషయం మా బాస్ గారి భర్త గ్వాలియర్‌నించి ఫోన్ చేసి చెప్పారు. ఆయనకీ విలియమ్స్ కి ఎలా పరిచయమో నాకు తెలీదు" గబగబా కిచెన్ వైపు వెడుతూ అన్నది శరద్వతి.

"ఎన్నాళ్ళ క్రితం?"

"పన్నెండు రోజుల క్రితం" లోపలికి వెళ్ళిపోయింది శరద్వతి.

"అయితే నాతో వుంటూనే బుక్ చేయించాడన్నమాట" తనలో తనుగా అనుకున్నాడు శ్రీనివాస్. ఏవేవో ఆలోచనలు అతని మనసులో.

మహా కన్యాదేవి మహామాయతో, పదహారుమంది కన్నెయోగినులతో ఉజ్జయిని మహా కాళేశ్వరాలయంలో ప్రవేశించింది. సంతోషం ఆమె ముఖంలో తాండవిస్తోంది. అక్కడి పూజారి మహా కన్యాదేవి ముఖవర్చస్సు చూసి అప్రయత్నంగా చేతులెత్తి నమస్కరించాడు.

మహా కాళేశ్వరుడు ఉజ్జయిని ప్రజలకూ ప్రభువులకూ కూడా కులదేవత. పన్నెండు జ్యోతిర్లింగాలలో మహా కాళేశ్వర లింగం ఒకటి. అవంతికా మహా కాళీశ్వరుడన్నా యీయనే. స్వయంభువు మాత్రమేకాదు. మహాద్భుతమైన మహిమగలవాడని మహా కాళేశ్వరుడ్ని భక్తులు తండోపతండాలుగా దర్శించుకుంటారు.

ఆ రోజు ఆలయం కిక్కిరిసివున్నా, మహా కన్యాదేవి పరివారానికి దర్శనం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఎవరూ చెప్పకున్నా నిరాఘాటంగా ముందుకెళుతోంది.

ఆలయం కిక్కిరిసి వుండటానికి కారణం ఆరోజు 'నాగపంచమి' కావడమే. మహా కాళేశ్వర ఆలయం మూడు అంతస్తులతో ఉంది. మొదటిది మహాకాళి లింగం. రెండవది ఓంకార లింగం. మూడవది నాగచంద్రేశ్వర లింగం. నాగచంద్రేశ్వర లింగాన్ని దర్శించాలంటే కేవలం నాగపంచమి రోజునే సాధ్యమవుతుంది. మిగతా రోజుల్లో దర్శనానికి అనుమతి లేదు. వారితోపాటు అవధానిగారూ హనుమంతూ కూడా వచ్చారు. అలా వెళ్ళమని ఆజ్ఞ ఇచ్చింది నిర్మలానంద.

మహాకాళి లింగం జలాభిషేకం తరవాత భస్మాభిషేకంతో అద్భుతమైన కాంతులీనుతున్నది. దీపాల వెలుగులో విభూతి సుందరుడు మెరిసిపోతున్నాడు. మహా కన్యాదేవి కళ్ళల్లో వెలుగు. 'హర హర శంకర మహా కాళేశ్వర్' అంటూ భక్తులు ఉచ్చస్వరంతో శివనామస్మరణ చేస్తున్నారు.

గంటలు గణగణా మ్రోగుతుండగా ఓంకార లింగదర్శనం జరిగింది.

"అకార ఉకార మకారముల సంయోగమే ఓంకారం. 'అ' అంటే పూర్తిగా తెరుచుకున్న నోరు. అది జాగ్రదవస్తకి సంకేతం. జాగ్రదవస్థ అంటే ఇంద్రియాలన్నీ మేలుకొన్న స్థితి. ఉ కారం అంటే, సగం తెరిచి సగం మూసుకున్న నోరు. అంటే స్వప్నావస్థ జాగ్రదావస్థ ప్రపంచంలో మనం వుంటే స్వప్నావస్థలో ప్రపంచమే మనలో వుంటుంది. అయినా అక్కడున్నది మనమూ ప్రపంచమే. కానీ అది 'కల'లో వున్న స్థితి. శరీరం నిశ్చలంగా ఉండగా మనస్సు అన్ని ఇంద్రియాలనీ తనలో ఇముడ్చుకుని పనిచెయ్యడం. ఇక మకారం అంటే పూర్తిగా మూసుకున్న నోరు. 'మ్'. ఇది సుషుప్తికి సంకేతం. అంటే లేవలేని స్థితి అన్నమాట. కల్లోనూ, ఇలలోనూ మనమూ, ప్రపంచమూ ఉంటాం. సుషుప్తి అంటే ఏదీలేని స్థితి. రంగు, రుచి, వాసన, స్పర్శ, నువ్వూ ,నేను, దేవుడూ దెయ్యాలు అంటే ఏమీ లేని స్థితి అన్నమాట. ఈ జాగ్రత్త స్వప్నసుషుప్తి అవస్థలు మూడు పడవల్లాంటివి. ఈ పడవల్లో ప్రతిరోజూ ప్రతి జీవీ పయినించే తీరాలి. ఆ విషయాన్ని మనం గ్రహించం" అక్కడున్న పూజారి అవస్థాత్రయం (జాగ్రత్, స్వప్న –సుషుప్తి అవస్థలు) గురించి క్లుప్తంగా చెబుతున్నాడు జనానికి.

"ఈ ఓంకార లింగదర్శనం మనకి చెప్పేది అదే. ఆ అవస్థలని గుర్తించామనీ ఆత్మ వాటికి అతీతమనీ!"

హారతి వెలిగించి ఓంకార నాధుడికి ఇస్తూ అన్నాడు. ఆయనకో అరవై సంవత్సరాల వయసుంటుంది.

నాగచంద్రేశ్వర లింగ దర్శనం కోసం గడప దగ్గరికి రాగానే మహా కన్యాదేవిలో ఓ గగుర్పాటు. వెండి నాగాన్ని? వెండి అర్ధచంద్రుడినీ లింగానికి అలంకరించారు. ఆ వెండి నాగం సజీవంగా ఉన్నట్టుంది. కళ్ళస్థానంలో అమర్చిన రత్నాలు రౌద్రంగా వెలుగుతున్నాయి.

'బుస్సు'న శబ్దం. ఆరడుగుల నల్లతాచు నాగచంద్రేశ్వర లింగం  పానవట్టం మించి నిలువుగా లేచి తలాడిస్తోంది. పెద్ద పడగా... విష్ణు పాదాలు. ఎక్కడ్నించి వచ్చిందో ఎలా వచ్చిందో తెలీక పూజారి ఒక్క గెంతు గెంతి ఇవతలకి దూకాడు. ఓ అర అడుగు దాటితే మహా కన్యాదేవి ముందున్న మాయాదేవి మీద పడివుండేవాడు. ఆ సర్పాన్ని మహామాయీ, మహాకన్యాదేవీ కూడా చూశారు. అవాక్కై నిలిచిపోయారు.

పూజారి చెప్పడంతో ఆలయ సెక్యూరిటీ వారు భక్తుల్ని బయటికి పంపారు.

చిత్రం ఏమంటే, ఆ పాము ఎవరికీ దొరకలేదన్న వార్త రావడమే కాక, పూజారి భ్రమపడ్డాడు అని జనాలు అనుకోవడం.

"నేను స్పష్టంగా చూశాను. ఆ సర్పం లోక మీద నుంచుంది" సన్నగా మహామాయతో అన్నది మహా కన్యాదేవి. "నేను చూశాను. అయినా ఆ విషయం మనలోనే ఉండనివ్వు" మహామాయ గుసగుసగా అన్నది.

కాలభైరవ మందిరం, హితసిద్ధ ఆలయం భర్తృ హరి గుహలు తీరిగ్గా చూసి మంగళ్‌నాద్ ఆలయ దర్శనం చేసుకున్నారు మహామాయి బృందం. ఆ తరువాత వారికి ఏర్పరిచిన బసకు వెళ్ళిపోయారు.

"ఆ నాగుపాముని మరువలేకున్నాను అమ్మా. వెండి నాగపు కళ్ళూ, ఆ నాగుపాము కళ్ళూ ఒకేలా వున్నాయి" వీరాసనంలో కూర్చుంటూ అన్నది మహా కన్యాదేవి.

"ఇప్పుడు ధ్యానమా?" ఆశ్చర్యంగా అన్నది మాయా.

"ఎందుకో పరమశివుడ్ని ధ్యానిస్తూనే వుండాలని వుంది" కళ్ళు మూసుకుంది మహాకన్యాదేవి.

మహామాయాదేవికి తెలుసు. ఇక కన్యాదేవి మాట్లాడదని.

"బాబాయ్.. ఇక్కడ మనం చూసిన ప్రతి ఆలయమూ నాకు బాగా తెలిసినట్టు అనిపించింది. ఉజ్జయిని పేరుకూడా ఇక్కడకు వచ్చేదాకా నేను వినలేదు. మరి ఇంతగా నా మనసు ఇక్కడి ప్రతి అడుగునీ సొంతం చేసుకోవడం ఏమిటీ? సిప్రా (క్షిప్రా) నదిలో యీతలు కొట్టాలని వుంది. మహాకాళేశ్వరాలయం గోపుర శిఖరం ఎక్కి నృత్యం చెయ్యాలనుంది" ఓ ట్రాన్స్‌లో చెబుతున్నట్లు అన్నాడు హనుమంతు.

"ఏమో.. ఏ జన్మలోనో ఇక్కడ పుట్టివుంటావేమో! పడుకో. రేపు తెల్లారు ఝామునే లేవాలి" ఆవలిస్తూ అన్నాడు అవధాని.

అన్నీ వెతికాం. ఏదీ కనిపించలేదు. వర్షం చేసిన విధ్వంసం అంతా ఇంతాకాదు" నీరసంగా అన్నాడు అనీషుడు.

"ఒకటి మాత్రం నిజం. వెతకాలన్నా ప్రస్తుతం వెతకడం కష్టం. ఎందుకంటే, విరిగిపడ్డ చెట్లని, దొర్లిపడ్డ రాళ్ళనీ పక్కకి తియ్యాలంటే చాలా సమయం పడుతుంది. చాలామంది మనుషులూ కావాలి" స్పష్టంగా అన్నాడు నీలుడు.

"నిరాశా నిస్పృహలు వద్దు. ఎందుకంటే, మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాము. ఫలం ఎప్పుడు ఎలా ఎవరిద్వారా అందుతుందో తెలిసింది విధికీ, కాలానికీ మాత్రమే. రేపు ఓ చిన్న 'నివృత్త' యాగం చేస్తే కార్యక్రమం సంపూర్ణంగా పూర్తవుతుంది" చిరునవ్వుతో అన్నారు సంకల్పానంద. "స్వామీ మీ గురించి చెప్పండి" అడిగాడు అలంబస.

"నేనా? చెప్పుకోదగినంతది ఏదీలేదు. వృత్తితీర్యా కుమ్మరిని. మా పూర్వీకులందరూ కుమ్మరులే. మహాప్రజ్ఞ కలవారు. మట్టిని గురించిన సర్వప్రజ్ఞలు వారికున్నాయి. అయ్యా, ఇప్పుడు కుమ్మరులు తయారు చేసేవి అతి తేలికైనవి. ఒకానొకప్పుడు ధాన్యమూ, పప్పుధాన్యాలు, ఉప్పు, చింతపండు ఒకటేమిటి, అన్నీ కుండల్లోనే జాగ్రత్తపెట్టుకునేవారు. ఆఖరికి ధనాన్ని కూడా. పురుగు, చెద పట్టకుండా ఉండాలంటే ప్రత్యేకమైన మట్టిని ఉపయోగించాలి. ధాన్యానికి ఉపయోగించే మట్టి వేరు. ఉప్పూ, మిరపకాయలకు ఉపయోగించే మట్టి వేరు. అంతేకాదు ఆ మట్టిని కుండగా మార్చి 'ఆము'లో కాల్చే పద్ధతి కూడా వేరైనదే. మా పూర్వీకులు చేసే కుండలు ఎంతటివంటే ఒక మనిషే అందులో దూరి దాక్కోవచ్చు. కొన్ని కుండల్ని సామాన్యంగా పగలగొట్టడమే అసాధ్యంలా ఉండేదిట. నా చిన్నతనాన ఓ యోగి మా ఇంటికి వచ్చి తనతో నన్ను పంపమని మా నాన్నని అడిగాడు. మా నాయనగారు ఒప్పుకోలేదు. అయినా ఆయన ఏదో నచ్చచెప్పారు. ఉజ్జయినిలో వున్న యజ్ఞనారాయణ మిశ్రావారి గురుకులంలో నన్ను చేర్చారు. వారిద్వారా విద్యాబుద్ధులు

వంటబట్టాయి.ఇక మిగతావా! నాయనా, ఏది ప్రాప్తమో అదే నాకు ప్రాప్తించింది. గురుపరంపర నన్ను నడిపిస్తోంది" వినయంగా తన గురించి సంక్షిప్తంగా వివరించారు సంకల్పానంద.

"మరి మంత్రాలు అవీ" మధ్యలో ఆగాడు అరిదమనుడు.

"ఓహో..! గురుకృపవల్ల ఉచ్చారణ సరికుదిరింది. అదీగాక నా గురువు సర్వజన సమతని బోధించేవారు. వారు వేదాన్ని వల్లెవేయించడమేకాదు. యజ్ఞ యాగాదుల నిర్వహణనీ మాకు నేర్పారు. కులమనే రాక్షసిని మా కంటబడనీయలేదు.అన్ని కులాలూ గొప్పవే. 'నా కులం మాత్రమే గొప్పది' అనడం అహంకారం. ఆ అహంకారం ఎన్నడూ మాకు అంటలేదు" నవ్వారు సంకల్పానంద.

"ఒకానొకప్పుడు కులం అనేది నిరుద్యోగ సమస్యని పరిష్కరించే మహాయుధం. మరో విధంగా మానవుడు సమకూర్చుకున్న విజ్ఞానాన్ని తరతరాలకు అందించే అద్భుతవిధిగా కులాలు వర్ధిల్లినాయి. సేద్యం, వండ్రంగి, కంసాలి, కమ్మరి, కుమ్మరి, ఇలా వృత్తి విద్యలన్నీ తరతరాలకీ మరింత మెరుగుపడుతూ సమాజానికి అందించినవి కులాలే, ఆనాడు ప్రతి వృత్తికీ ఎంతో గౌరవం ఉండేది. ఆహార వ్యవహారాల్లోనూ, సంబంధ బాంధవ్యాలలోనూ అందరూ స్వతంత్రులే సమానులే. మెలమెల్లగా అహంకారాల వల్ల కుల వ్యవస్థ దుర్భరమైపోయింది. అయినా ఈనాడు కులంతో పనేలేదుగా! ఏ విద్యనైనా ఏ కులం వారైనా విద్యాలయాల్లో నేర్చుకోవచ్చు" అన్నాడు అలంబసుడు.

"ప్రతి విద్యకీ తనదైన ప్రత్యేకత ఉంది. అందుకే, తండ్రిని మించిన సద్గురువెవరూ? నా తండ్రి నాలుగు వేదాలు క్షుణ్ణంగా అభ్యసించాడు. నాకు సుస్వరంతో నేర్పాడు. వేద, ఉపనిషత్తుల సారాన్ని బోధించాడు. కానీ నేనో మొండివాడిని. నా మనసు ఎప్పుడూ 'కర్మ'ల మీదికే మళ్ళింది. వెతుకుతూనే వెళ్ళాను. మధురలో నాకో సాధువు పరిచయమయ్యాడు. రామాయణ భారత భాగవతాలు హృద్యంగా బోధించాడు బయటికి కనిపించే వస్తువుని కాక లోపల వుండే వ్యక్తిని గమనించమని చెప్పాడు. కొన్నేళ్ళు ఆయన శిష్యరికం చేశాను ఆయన చనిపోతూ నన్ను ఓ మాట అడిగాడు" ఆగాడు అరిదమనుడు.

"ఏమాట?" కుతూహలంగా అడిగాడు అలంబసుడు. అనీషుడు మహా కుతూహలంగా చెవులు రిక్కించి కూర్చున్నాడు. నీలుడు, మట్టు కూడా ముందుకు జరిగి కూర్చున్నారు. నిశ్చలానంద మాత్రం చిన్న చిరునవ్వుతో అందర్నీ పరికిస్తున్నాడు. అడవిలో సాయంకాలపు సందడి మొదలైంది. పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. నిరాచరజీవులు పక్షులు రాత్రిని స్వాగతించడానికి సమాయత్తమవుతున్నాయి. దూరంగా వున్న బ్రాహ్మణ బాలకులు సూక్త పఠనం మొదలెట్టారు. పరిచారికలు దివిటీలు వెలిగించే ప్రయత్నంలో ఉన్నారు.

"చెప్పు అరిదమనా.. నాకు మీమీద జాలిగా ఉంది" అన్నాడు అనీషుడు.

ఎవరి చేతిలోంచో ఓ పళ్ళెం జారి ప్రాంగణంలో వున్న నాపరాళ్ళమీద పడి భళ్ళున శబ్దించింది. కాలం ఓ క్షణం ఆగింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments